క్లుప్తంగా

ఆలయానికి విరాళం..



విరాళం అందజేస్తున్న భక్తురాలు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి సూర్యపేటకు చెందిన గజవెల్లి వెంకటాచార్యులు, వనజ దంపతులు రూ.10,001 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు సాధించిన భవ్యశ్రీ



భవ్యశ్రీతో తండ్రి రవి, హెచ్‌ఎం రామస్వామి

టేకులపల్లి: పాతర్లగడ్డ గ్రామానికి చెందిన మేకల రవి కుమార్తె భవ్యశ్రీ పాతర్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. గత నెల మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బాల బాలికలను ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన భవ్యశ్రీ మొత్తం 14 పాయింట్లు సాధించి కరీంనగర్ క్రీడా పాఠశాలలో సీటు సాధించింది. ఈ ఎంపికలో జిల్లా నుంచి మొత్తం 11 మంది ఎంపిక కాగా టేకులపల్లి మండలం నుంచి భవ్యశ్రీ ఎంపికయింది. ఈ మేరకు ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్, నోడల్ అధికారి అజ్మీర జగన్, హెచ్‌ఎం రామస్వామి భవ్యశ్రీని అభినందించారు.

గానకోకిల అవార్డు ఎంపిక కమిటీ నియామకం



కమిటీ నియామక సభ్యులు

ఇల్లెందు: ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్న ఉద్యమ గానకోకిల అవార్డులకు గాయకులను ఎంపిక కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీని ఎంపిక చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో కమిటీ సభ్యులుగా నియామకమైన సీతారాములు, నిర్మల, సాకీలు తెలిపిన వివరాలు... ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ సామాజిక సమస్యలను ప్రజల ముంగిట ఉంచుతున్న వారికి ఉత్తర తెలంగాణ గానకోకిల బిరుదుతో సత్కరించాలని నిర్ణయించారని తెలిపారు. వారి ఎంపిక కోసం ఏర్పాటు చేసిన కమిటీలో తమకు ప్రాతినిధ్యం కల్పించడం అభినందనీయమన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న కుమార్

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగా కిరణ్ అధ్యక్షతన ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, జిల్లాలో అర్హత కలిగిన ప్రతీకుటుంబానికి రేషన్ కార్డులు, పింఛన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు విషజ్వరాల బారిన పడ్డారని, పారిశుద్ధ్యం, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. రైతు భరోసా కింద రైతులకు కూలీలకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ రాజకీయ తీర్మానం చేశారు. ముస్కు శ్రీనివాస రెడ్డి, బానోతు విజయలక్ష్మి, కుంజా ధర్మా, చిలుకూరి రమేష్, ఐలయ్య పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి..

జూలూరుపాడు: పడమటనర్సాపురం పీఎంహెచ్ హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పీఎంహెచ్ హాస్టల్‌ను ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించి, విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... హాస్టల్ భవనం గుట్ట పక్కనే ఉండటంతో ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు భయాందోళన గురవుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరారు.

విష జ్వరాలతో విలవిల

- ప్రతీఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులు
- సీతంపేట బంజరలో ఊరంతా జ్వరాలే
- వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రజలు





సీతంపేట బంజరలో జ్వరంతో బాలుడు, చెత్తతో నిండిన డ్రెయినేజీ

సుజాతనగర్: విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మండలంలో ఐదారు గ్రామ పంచాయతీలు మినహా మిగిలిన గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో మూలుగుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల వ్యాప్తి, వాతావరణంలో జరిగే మార్పులతో అనేకమంది జ్వరాల బారిన పడ్డారు. కాలానుగుణంగా (సీజనల్) జ్వరాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఊరంతా జ్వరాలే...

సీతంపేట బంజర, రాంజీతండా గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో విలవిలలాడుతున్నారు. గ్రామంలో చాలామంది కీళ్ల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. ఇంట్లో ఇద్దరు, ముగ్గురుని అంతుచిక్కని జ్వరం పట్టి పీడిస్తోంది. చిన్నాపెద్దా లేకుండా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. మొదట ఒళ్లు నొప్పులతో ప్రారంభమై ఆ తర్వాత జ్వరం వచ్చి తగ్గకపోవడంతో బాధితులు బాగా నీరసించి మంచానికే పరిమితం అవుతున్నారు. భరించలేని కాళ్లు, కీళ్ల నొప్పులతో అడుగుతీసి అడుగువేయలేకపోతున్నారు. దీనిమూలంగా చేతికర్ర సాయంతో నడవాల్సి వస్తోంది. గ్రామంలోని నాలుగు వీధుల్లో ప్రతీఇంట్లో జ్వరపీడితులే ఉండటం గమనార్హం. గ్రామంలోని కాలువల్లో పూడికతీయకపోవడం, వర్షపు నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండటంతో దోమలు పెరగడంతో పాటు, అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ఆరునెలల వరకు నొప్పులు తగ్గవని ఆర్‌ఎంపీ వైద్యులు రోగులకు చెప్పడంతో భయాందోళనకు గురవుతున్నారు.

పల్లెల్లో జ్వరాలు.. అల్లంత దూరంలో వైద్యం..

మండలంలోని సుజాతనగర్, సింగభూపాలెం, సీతంపేట, నిమ్మలగూడెం, రాఘవాపురం, మంగపేట, సర్వారం గ్రామాల్లో జ్వరాలు సోకడంతో ఆయా గ్రామాల ప్రజలు వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ వైరల్ ఫీవర్ అందరినీ వణికిస్తోంది. మారుమూల గ్రామాల్లో జ్వరాల తీవ్రత అధికమవుతున్నా స్థానికంగా వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. వర్షాలతో మురుగు నిల్వ ఉండడం, దోమలు, ఈగలు వృద్ధి చెందడం,



ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న మహిళ

కలుషిత నీటి ప్రభావం, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం కారణాలుగా స్థానికులు చెబుతున్నారు. స్థానిక వైద్య సిబ్బంది నామమాత్రంగా వచ్చి వెళుతున్నారే తప్ప వైద్య శిబిరాలు నిర్వహించడం లేదని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం లేదని, ఇప్పటికైనా జ్వరాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

అందరికీ జ్వరాలు వస్తున్నాయి..



20 రోజుల క్రితం విపరీతమైన మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడ్డాను. స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వద్ద తగ్గకపోవడంతో కొత్తగూడెం వెళ్లి వైద్యం చేయించుకున్నాను. ప్రస్తుతం కొంచెం పర్వాలేదు. ఊరిలో చాలామంది ఇదే సమస్యతో బాధపడుతున్నారు.

– పోతుగంటి సుధాకరాచారి, సీతంపేట బంజర

ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన...



వారం రోజుల క్రితం మొదట్లో జ్వరం వచ్చింది. జ్వరం తగ్గిన తరువాత కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు ప్రారంభమైనాయి. కళ్లు తిరిగినట్లుగా అనిపించి ఒళ్లంతా చాలా నీరసంగా ఉంది. ఆర్‌ఎంపీ దగ్గర తగ్గలేదు. కొత్తగూడెం వెళ్లి పెద్ద డాక్టరు దగ్గర వైద్యం చేయించుకున్నా.

– గుగులోత్ భాస్కర్, సీతంపేట బంజర

వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం...



గ్రామాల్లో ఎక్కువగా వైరల్ ఫీవర్లు ఉన్నాయి. డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు మాస్క్ ధరించాలి. గ్రామాల్లోని ఆర్‌ఎంపీలను సంప్రదించవద్దు. ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. పరిశుభ్రత పాటించాలి.

– డాక్టర్ రమేష్, వైద్యాధికారి, సుజాతనగర్

టెండర్లను గిరిజనేతరులకు అప్పగించాలి



మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

పాల్వంచ: కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి పాండ్ యాష్, బాటమ్ యాష్, ఫ్లైయాష్ లిఫ్టింగ్ చేసుకునేందుకు కాలుష్య ప్రభావిత ప్రాంతాలకు చెందిన గిరిజనేతరులకు టెండర్ ఆర్డర్ ద్వారా అవకాశం కల్పించాలని కాంట్రాక్టర్లు ఎస్‌కె.సలీం, సంపూరి నాగేంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాష్ లిఫ్టింగ్ తమకు దక్కాలని గిరిజనులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అయితే కర్మాగార కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో అన్నికులాలకు అవకాశం కల్పించాలని హైకోర్టు జెన్‌కో యాజమాన్యానికి సూచించిందన్నారు. 2024 ఏప్రిల్ 4న తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. సమావేశంలో వైవీ రెడ్డి, కిషోర్, సీతారాములు, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవుల విధ్వంసాన్ని ఆపండి



మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ చట్టాలను హరించి రాజ్యాంగ వ్యతిరేకంగా అడవులను విధ్వంసం చేసేందుకు కేంద్ర పాలకులు అడవులను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్, ఓపెన్ కాస్టులు, పరిశ్రమల పేరుతో దేశంలో ఉన్న రూ.11 కోట్ల ఆదివాసీల బతుకులకు ప్రమాదం సృష్టిస్తున్నారని తెలిపారు. ఆదివాసీలు అడివిని నమ్ముకుని జీవిస్తున్నట్లు చెప్పారు. అలాంటి ఆదివాసీను అడివి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేయటం తగదన్నారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామగ్రామాన నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా హర్‌జ్యా, జడ సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, బయ్యా శారద, మోకాళ్ల సుగుణ, భూక్యా చిన్ని, ఉపేందర్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ఆదివాసీ దినోత్సవం నిర్వహించండి

ఆగస్టు 9న గ్రామగ్రామాన ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, కార్యదర్శి జార కృష్ణ, ప్రచార కార్యదర్శి తాటి మధు అన్నారు. ఆదివారం ఇల్లెందులో మాట్లాడుతూ... ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా లంబాడాలతో కలిసి నిర్వహించటం తగదన్నారు. దొడ్డిదారిన ఎస్టీలలో కలిసిన వారితో కలిసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించి జాతిని అభాసుపాలు చేయవద్దన్నారు. 1/70 చట్టం అమలు చేయాలని, పెసా కమిటీలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. హక్కులు సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు.

వ్యవసాయ కూలి రేట్లు పెంచాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సుజాతనగర్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలి రేట్లు పెంచాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వ్యవసాయ కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుజాతనగర్‌లో ఆ సంఘం సమావేశం గండమాల భాస్కర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వ్యవసాయ కార్మికుల కూలి రేట్లు పెంచాలన్నారు. వీర్ల రమేష్, కాట్రాల తిరుపతి, సోలం నాగరత్నం, ఆకునూరి పద్మ, కొప్పుల సత్యావతి, పెద్దమల అనసూర్య, సట్టు శైలజ, వీర్ల రమణ, బత్తుల కళావతి పాల్గొన్నారు.

అందరికీ మాఫీ వర్తింపజేయండి



మంత్రికి సమస్య వివరిస్తున్న కోటేశ్వరరావు

ఇల్లెందురూరల్: పంటరుణాలు తీసుకున్న ప్రతీరైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాలలో ధరణి పోర్టల్ రాకముందు మాన్యువల్ పహణీ ఆధారంగా బ్యాంకులు పంటరుణాలు ఇచ్చేవని గుర్తుచేశారు. ఆ రుణాలను రైతులు ప్రతీఏటా రెన్యూవల్ చేసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో సీఎం ప్రకటించిన విధంగా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. కానీ నిబంధనల కారణంగా ఏజెన్సీలో ఎక్కువ సంఖ్యలో గిరిజనేతరులు రుణమాఫీకి నోచుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు జనగం కోటేశ్వరరావు, మేకల మల్లిబాబుయాదవ్, కాంగ్రెస్ నాయకులు పులిగళ్ల మాధవరావు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం – పచ్చదనం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో సోమవారం నుంచి స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయి.

కార్యక్రమాలు ఇలా..

- 5వ తేదీ వార్డుల్లో శ్రమదానం కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తపై ప్రచారం నిర్వహిస్తారు.
- 6వ తేదీ వాటర్ లీకేజీల అరికట్టడం, ఇంకుడు గుంతల కోసం ప్రచారం కల్పించడం.
- 7వ తేదీ డ్రెయినేజీలు క్లీనింగ్ చేయించడం, నీటి నిల్వలను తొలగించడం చేస్తారు.
- 8వ తేదీ వీధి కుక్కలను అరికట్టడం, విష జ్వరాలపై సర్వే, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టనున్నారు.
- 9వ తేదీ బ్లీచింగ్ చల్లే కార్యక్రమం.

జూలూరుపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగిస్తూనే స్వచ్ఛదనం – పచ్చదనం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రైవేటు టీచర్లపై సీఎం వ్యాఖ్యలు గర్హనీయం

ఇల్లెందురూరల్: ప్రైవేటు ఉపాధ్యాయులను కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపాటి నరేష్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పీజీ, డిగ్రీ, బీఈడీ చదువుకొని ప్రభుత్వం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు లేక పొట్టకూటి కోసం ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న నిరుద్యోగులనూ అవమానించే విధంగా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో అదనపు సమయం పనిచేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య భోదించి రాష్ట్ర స్థాయి ర్యాంకులలో నిలిపిన ఘనత ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులదని గుర్తుచేశారు. సీఎం వెంటనే నిరుద్యోగులైన ప్రైవేటు ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఖబరస్థాన్ స్థలాలను స్వాధీనం చేయండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో, చుంచుపల్లి మండలంలో ఖబరస్థాన్లకు కేటాయించిన స్థలాలను వెంటనే ముస్లిం సమాజానికి స్వాధీనం చేయాలని అహలే సున్నత్వల్ జామాత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ కరీం డిమాండ్ చేశారు.

ఆదివారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గత ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవతో ఈ రెండు ప్రాంతాల్లో స్థలాల కేటాయింపు ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిందన్నారు. కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌జే ప్రధాన కార్యదర్శి షేక్ యాఖూబ్ ఖాద్రీ, ఖమర్, హుస్సేన్‌ఖాన్, షమీఉద్దీన్, కీమత్ మియ, షేక్ నయా చిష్తి, అడ్వకేట్ సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి..

సింగరేణి(కొత్తగూడెం): కారుకొండ రామవరం–పోస్టాఫీస్ సెంటర్ బైపాస్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సింగరేణి సీఎండీ బలరామ్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఆదివారం సింగరేణి భవనలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్యం వందలాది బొగ్గు టిప్పర్లు కోయగూడెం నుంచి రుద్రంపూర్‌లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ)కి బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ లారీలతో రోడ్డు అధ్వానంగా మారిందని, ప్రధానంగా కోర్టు నుంచి హేమచంద్రాపురం క్రాస్ రోడ్డ వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నట్లు చెప్పారు. స్పందించిన సీఎండీ రోడ్డును పరిశీలించి త్వరలో మరమ్మతు పనులు చేయిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో అభివృద్ధి పనులకు కేటాయించిన రూ.1.36 కోట్ల పనులను తక్షణమే ప్రారంభించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, వైద్య శాఖాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన మరమ్మతులకు రూ.38 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. డయాలసిస్ కేంద్రం, ఆపరేషన్, ఐసీయూ గదుల పూర్తిస్థాయి మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు రూ.50 లక్షలు, పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి డ్రెయినేజీ నిర్మాణం, ఇతర మరమ్మతులకు రూ.48 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తీసుకొస్తామని కూనంనేని వివరించారు.

గ్రామాల్లో డీపీఓ ఆకస్మిక తనిఖీలు



పడమటనర్సాపురంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) చంద్రమౌళి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. పడమటనర్సాపురం, భేతాళపాడు, గుండ్లరేవు, అన్నారుపాడు, పాపకొల్లు, జూలూరుపాడు తదితర గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు, మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను నిరంతరాయంగా కొనసాగించాలని సెక్రటరీలను ఆదేశించారు. అదేవిధంగా సోమవారం నుంచి 9వ తేదీ వరకు జరిగే స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ కార్యచరణపై సెక్రటరీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి రమణ, మండల పంచాయతీ అధికారి టి.తులసీరామ్, సెక్రటరీలు హరిత, ఇస్మాయిల్, కార్తీక్, రమణి, అశోక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. వర్షాల కారణంగా చెత్త ఏపుగా పెరగడంతో దోమల ఉధృతి, కీటకాల బెడద అధికమైనా పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ.. 'కొత్త సార్లు.. సమస్యల స్వాగతం'శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మండల పంచాయతీ అధికారి చిరంజీవి స్పందించారు. సెలవురోజు అయినప్పటికీ ఆదివారం గ్రామాలలో పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్వయంగా పర్యవేక్షించారు. వీధులలో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించారు. ఇదే తరహాలో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని కొనసాగించి పల్లెలను స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దే వరకు అన్ని గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య పనులు కొనసాగిస్తామని ఎంపీఓ తెలిపారు.

గంజాయిని నిర్మూలిద్దాం..



ఇల్లెందు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

ఇల్లెందు: గంజాయి వల్ల ఇల్లు, వల్లు గుల్ల అవుతుందని ఎవరైనా సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎన్ చంద్రభాను అన్నారు. ఆదివారం ఇల్లెందు బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్‌లో వాల్ పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గంజాయి రవాణా వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ భూక్యా సూర్య, పోలీసులు పాల్గొన్నారు.

పాల్వంచ: గంజాయిపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ఇది ప్రతీఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పాల్వంచ సీఐ వి.వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జన సంచార ప్రదేశాలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, షాపులు, వివిధ సెంటర్లలో గంజాయిపై సమాచారం అందించాలని స్టిక్కర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ, విక్రయిస్తున్నట్లు గానీ, సేవిస్తున్నట్లు గానీ తెలిసినా, చూసినా, అనుమానం వచ్చినా వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. 8712682133, 8712682135 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలి



మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ఈ నెల 8 వరకు కోల్‌బెల్ట్ పరిధిలోని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం తెలిపింది. ఆదివారం ఇల్లెందులో ఆ సంఘం నాయకులు యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులు వేతనాలు పెంచాలని కోరుతున్న సింగరేణి యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని తమ సంఘం నిర్ణయించిందన్నారు. మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, కె.రఘు, గురునాథం, సత్యనారాయణ, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు విరమించుకోండి..



మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

పాల్వంచ: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్పు చేయాలని అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేయడాన్ని నిరసిస్తూ ఆర్యవైశ్య మహాసభ, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొల్లేరుగూడెంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు చలవాది ప్రకాష్ మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన పేరుతో ఉన్న తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు ఆలోచన విరమించుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాటికొండ సురేష్, పెండ్యాల సతీష్, కొప్పరపు రాము, బచ్చు శ్రీనివాస్, చిరునోముల ప్రసాద్, సంక రవి, వందనపు శ్రీనివాస్, అనిల్, గణేష్, రవి, గూడెపు శ్రీనివాస్, శివ, గిరిధర్, నర్సింహాకుమార్, ఉప్పల వెంకటేశ్వర్లు, అప్పన కుమార్, ఇందుకూరు సాయి, రంగ నరసింహారావు, నాగు పాల్గొన్నారు. అనంతరం ఫ్రెడ్ షిప్ డే పురస్కరించుకుని ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి



మాట్లాడుతున్న డీఈ నందయ్య

పాల్వంచరూరల్: తోగ్గూడెం గ్రామంలో ఆదివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాడుతున్న విద్యుత్ లైన్లను, ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేశారు. టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ నందయ్య మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్ల స్టాటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, వాటి వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మయ్య, ఏఈ రవీందర్, ఓఅండ్‌ఎం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183